క్లుప్తంగా

చాముండేశ్వరికి పూజలు



దర్శించుకొంటున్న భక్తులు

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): చాముండేశ్వరి అమ్మ వారికి ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయంలోగల బ్రహ్మి, కాళీ, వైష్ణవి అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

కూలిన విద్యుత్‌ స్తంభాలు



కూలిన విద్యుత్‌ స్తంభం

మెదక్‌జోన్‌: పట్టణంలోని హౌసింగ్‌ బోర్డులో శనివారం రాత్రి నాలుగు విద్యుత్‌ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్ని మాసాల క్రితం కాలనీలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా విద్యుత్‌లైన్‌ వేశారని, గుంతలుతీసి మట్టితోనే పూడ్చారని అందుకే ఈ దుస్థితి వచ్చిందని స్థానికులు ఆరోపించారు. రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షానికే ఏకంగా నాలుగు స్తంభాలు నేలకూలడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో పాల్గొన్న రైతులు

నర్సాపూర్‌: తమకు కాలువ వద్దు అర్బన్‌ డెవలప్‌మెంటు ముద్దు అంటూ రైతులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి పదో రోజుకు చేరాయి. సంగారెడ్డి రీచ్‌–2 కాలువ తమ ఏరియా నుంచి వద్దని, తప్పనిసరిగా నిర్మించాల్సి వస్తే తమ భూమికి భూమి ఇవ్వాలని, లేనిపక్షంలో ఎకరానికి రూ.60 నుంచి 70 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్‌ చేస్తున్నారు. దీక్షలో బ్రాహ్మణపల్లి, పెద్దచింతకుంట, చిన్న చింతకుంట గ్రామాలకు చెందిన రైతులు నర్సింహారెడ్డి, రాజమౌళి, పోచయ్య, ప్రేమ్‌చరణ్‌, మహేశ్‌గౌడ్‌, శ్రీకాంత్‌రెడ్డి, అంజాగౌడ్‌, తుక్కయ్య, చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మకు మొక్కులు



పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని తునికి శ్రీనల్లపోచమ్మతల్లికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఉదయం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్‌ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన చేశారు. బోనాలుతీసి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంవద్ద డప్పు చప్పుడు శివసత్తుల పూనకాలు అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): పిచ్చికుక్క దాడిచేసి ముగ్గురితో పాటు ఓ గేదెను గాయపరిచింది. మండల పరిధిలోని బండపోతుగల్‌ గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. దాడిలో గ్రామానికి చెందిన డప్పు బాలు, ఎర్రోల్ల బాలమ్మ, కోటల నాగయ్య గాయపడ్డారు. కోటల శేఖర్‌కు చెందిన గేదెపైనా దాడిచేసి గాయపర్చింది. బాధితులకు జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందజేశారు. అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరారు.

చికిత్స పొందుతూ మృతి

తూప్రాన్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఐ యాదగిరి కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన నాగోరావ్‌ హన్మండ్లు(40) గత 18న నర్సాపూర్‌ చౌరస్తా సమీపంలో ఓ స్కూటీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్సచేసిన వైద్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ చికిత్స పొందుతూ హన్మండ్లు ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి కానిస్టేబుల్‌ నర్సింహులు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

నిధులులేక గదుల కొరత

- శిథిలమవుతున్న భవనాల్లోనే బోధన
- వచ్చి చేరుతున్న వర్షపు నీరు
- ప్రమాదకర పరిస్థితుల్లో విద్యార్థులు
- అందని మౌలిక వసతులు

బంగారు భవిష్యత్‌ పొందాలంటే ఉన్నతమైన విద్యతోనే సాధ్యం. అందుకు మొదటి మెట్టు పాఠశాలలు. కార్పొరేట్‌కు ధీటుగా వసతులు కల్పిస్తామంటూ ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్య పెంచాలి, ఉత్తమ ఫలితాలు సాధించాలి అంటూ ఉపాధ్యాయులపై ఒత్తిడికూడా తీసుకొస్తున్నాయి. అందులో భాగంగా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలకు తీసుకొస్తున్నారు ఉపాధ్యాయులు. కాని చాలా చోట్ల విద్యార్థులకు తగినట్టు గదులులేవు. ఉన్న స్కూళ్లు కూడా ఎప్పుడు కూలిపోతాయో చెప్పలేని విధంగా ఉన్నాయి. చాలీచాలని గదులు, ప్రమాదకర పరిస్థితిల్లో విద్యాబోధన సాగడం విచారకరం.

– శివ్వంపేట(నర్సాపూర్‌)



శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

విద్యార్థులకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో బోధనలో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. పూర్తిస్థాయి వసతులు లేకపోవడంతో మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. శివ్వంపేట, గూడూర్‌, మగ్దుంపూర్‌, శివయ్యగూడం, గోమారం బీసీ కాలనీ, బిజ్లీపూర్‌లో గదుల కొరత నెలకొంది. పలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగినప్పటికీ ఒకేగదిలో బోధన నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రమైన శివ్వంపేటలో తెలుగు, ఇంగ్లిష్‌ మీడియంలకు పది తరగతిగదులు, హెచ్‌ఎం, స్టాఫ్‌, గేమ్స్‌, సైన్స్‌ ల్యాబ్‌, గ్రంథాలయం కోసం గదులు అవసరం ఉండగా కేవలం కొత్త భవనంలో ఎనిమది గదులు మాత్రమే ఉన్నాయి.

ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు?

శివ్వంపేట ఉన్నత పాఠశాలలో 470మంది విద్యార్థులు ఉన్నారు. కాని వారికి సరిపడా తరగతి గదులు లేవు. ఉన్న భవనం కూడా శిథిలావస్థకు చేరింది. ఆ భవనంలోనే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల గదుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వేలాది మందికి విద్యబోధించిన ఈ పాఠశాల సమస్యలు పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాడైపోయిన తరగతి గది పైకప్పు

పాఠశాల భవనంలోనే కాలేజీ..

గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్న ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్‌ కాలేజీ కొనసాగుతోంది. కొత్త భవనంలో మూడు గదులు, పాత భవనంలో మూడు గదులు కేటాయించారు. జూనియర్‌ కాలేజీకి సొంత భవనం లేకపోవడంతో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులకు గురౌతున్నారు.

వర్షపు నీటితో నిండిన క్రీడా మైదానం

కొద్దిపాటి వర్షానికి పాఠశాల ఆవరణ బురదమయంగా మారుతోంది. చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యమిచ్చేందుకు పీడీ ఉన్నప్పటికీ క్రీడా మైదానం వర్షపు నీటితో నిండిపోతుండడంతో ఆటలు ఆడలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఈ పాఠశాల నుంచి విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడల్లో ప్రతిభ కనబరిచారు.



వర్షపునీటితో నిండిన స్కూల్‌ గ్రౌండ్‌

నూతన భవనాలు నిర్మించాలి

మండలంలోని శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు తొలగించి నూతన భవనాలు నిర్మిస్తే విద్యార్థుల ఇబ్బందులు తొలగిపోతాయి. అలాగే క్రీడా మైదానం చదునుచేస్తే ఆటలు ఆడేందుకు ఆస్కారం ఉంటుంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

ఉన్నతాధికారులకు నివేదించాం



మండలంలోని పలు పాఠశాలల్లో గదుల కొరత, శిథిలావస్థకు చేరిన భవనాల గురించి ఉన్నతాధికారులకు నివేదించాం. అందుకు సంబంధించి నిధులు మంజూరు అయితే సమస్యలు పరిష్కారం అవుతాయి.

– బుచ్యానాయక్‌, ఎంఈఓ

భక్తి శ్రద్ధలతో గురుపూజోత్సవం



చిన్నశంకరంపేటలో.. హారతి కార్యక్రమంలో పాల్గొన్న బాబా భక్తులు

గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా గురుపూజోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాతో పాటు వివిధ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



కొల్చారం(నర్సాపూర్‌): ప్రసంగిస్తున్న మాధవానంద సరస్వతి



పెద్దశంకరంపేట(మెదక్‌): మాట్లాడుతున్న కృష్ణ



చేగుంట(తూప్రాన్‌): పల్లకిసేవలో భక్తులు



పాపన్నపేటలో..



చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): అంతారంలో..

విద్యుత్‌కు జీవాలు బలి



మృతి చెందిన గేదె

శివ్వంపేట(నర్సాపూర్‌): విద్యుదాఘాతంతో ఓ పాడిగేదె మృత్యువాత పడిన ఘటన మండల పరిధి రెడ్యా పంచాయతీ వెంక్యాతండాలో ఆదివారం చోటు చేసుకుంది. తండాకు చెందిన రైతు పాండు తన గేదెలను రోజూలాగానే మేతకోసం పొలాల వద్దకు తీసుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో విద్యుత్‌ స్తంభానికి తాకడంతో ఒక పాడిగేదె మృతి చెందింది. ఎర్తింగ్‌ లోపం వల్ల స్తంభానికి విద్యుత్‌ ప్రసారం జరిగిందని చెబుతున్నారు. గేదె విలువ రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు విలపించాడు.

మరో ఘటనలో ఎద్దు..

అల్లాదుర్గం(మెదక్‌): చిల్వేర ఐబీ చౌరస్తాలో గొల్లకుంట తండాకు చెందిన రవీందర్‌ తన ఎద్దులను గ్రామ శివారులో మేతకు తీసుకువెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా మినీ విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద వైరుకు తాకడంతో షాక్‌ తగిలి ఓ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.80వేలు ఉంటుందని, అధికారుల నిర్లక్ష్యంవల్లే ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు ఆరోపించాడు.



‘లిటిల్‌ సోల్జర్స్‌’ చేయూత



నిత్యావసరాలు అందజేస్తున్న లిటిల్‌ సోల్జర్స్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): అప్పుల బాధతో భర్త మృతి చెందగా ఇల్లు గడవని పరిస్థితిలో ఉన్న మండల కేంద్రంలోని దదువాయి శంకరమ్మకు లిటిల్‌ సోల్జర్స్‌ ఫౌండేషన్‌ సభ్యులు నాలుగు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసి భరోసా కల్పించారు. ఆమె భర్త పరమేశ్వర్‌ ఇటీవల అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ముగ్గురు పిల్లతోపాటు ఆ తల్లి శంకరమ్మ పేదరికంతో ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన లిటిల్‌ సోల్జర్స్‌ కర్నాటి నరేశ్‌, పులిరాజు స్పందించారు. దీంతో ఆదివారం వారు బాధిత కుటుంబ సభ్యులకు సాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పోచయ్య పాల్గొన్నారు.

వైభవంగా విఠలేశ్వర ఉత్సవాలు



ఉట్టి కొడుతున్న చిన్నారులు

పెద్దశంకరంపేట(మెదక్‌): మండల కేంద్రంలోని రుక్మిణీవిఠలేశ్వర స్వామి ఆషాఢమాస ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు ఆలయంలో సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక అభిషేకాలు, గోపాలకాలువల(పల్లకిసేవ), ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆచూకీ తెలియజేయాలి



శ్రీకాంత్‌రెడ్డి(ఫైల్‌)

చేగుంట(తూప్రాన్‌): కోర్టు కేసు నుంచి తప్పించుకు తిరగుతున్న వ్యక్తి ఆచూకీ కోసం విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. నార్సింగి గ్రామానికి చెందిన మల్లప్పగారి శ్రీకాంత్‌రెడ్డి 2017లో తమిళనాడులో గంజాయి కేసులో పట్టుబడి కోర్టు కేసు నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడు. అతడి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌ స్టేషన్‌లో తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు.

అందరూ ధర్మబద్ధంగా మెలగాలి

- మానసిక దివ్యాంగులకు చేయూత
- శ్రీగురుపీఠం అధ్యక్షుడు శివకుమార్‌



మాట్లాడుతున్న శివకుమార్‌ గౌడ్‌

శివ్వంపేట(నర్సాపూర్‌): సమాజంలో ప్రతి ఒక్కరు ధర్మబద్ధంగా మెలగాలని శ్రీగురుపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్‌ ఉద్బోధించారు. మండల పరిధి గూడూర్‌ శ్రీగురుపీఠంలోని సాయిబాబా, దత్తాత్రేయస్వామి బాలాలయాల్లో ఆదివారం వేద పండితుడు వెంకటేశ్వరశర్మ ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పీఠం ఆధ్వర్యంలో 20మంది మానసిక దివ్యాంగులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపాదనలో కొంత భాగాన్ని సామాజిక సేవలకు ఉపయోగిస్తున్నామన్నారు. శివ్వంపేట ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా మారేందుకు ఆలయాల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. పేద కుటుంబాలను ఆదుకోవడంతోపాటు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం దత్తాత్రేయ సహిత, గురుపరంపర స్తోత్రమాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గురుపీఠం సభ్యులు రమాదేవి, సూర్యంగౌడ్‌, శ్రీనివాస్‌ గౌడ్‌, భిక్షపతి యాదవ్‌, హన్మంతు, లక్ష్మీకాంతారావు, సుదర్శన్‌గౌడ్‌, జంగం వెంకటేశ్‌, శ్రీనివాస్‌, లిల్లీ, చిన్న, నర్సయ్య, భాస్కర్‌, వజ్జే సాయికిరణ్‌, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మదేవికి ఘనంగా బోనాలు



కౌడిపల్లిలో బోనాల ఊరేగింపు

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండల కేంద్రమైన కౌడిపల్లిలో రేణుక ఎల్లమ్మదేవి అలయ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం గౌడసంఘం సభ్యులు గ్రామదేవత పోచమ్మదేవికి బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా బోనాలు తీసి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షుడు చంద్రం కృష్ణాగౌడ్‌, చంద్రం దుర్గాగౌడ్‌, పుండరీకం గౌడ్‌, పెంటాగౌడ్‌, సత్యనారాయణగౌడ్‌, రమేశ్‌గౌడ్‌, దుర్గాగౌడ్‌, మల్లికార్జున్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊరేగింపు

టేక్మాల్‌(మెదక్‌)/నిజాంపేట(మెదక్‌): టేక్మాల్‌ మండలంలోని కుసంగి గ్రామంలో ఆషాఢమాసంలో భాగంగా గ్రామ ముదిరాజ్‌ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎల్లమ్మకు బోనాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఊరేగింపులో శివసత్తుల వేషధారణలో నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా నిజాంపేట మండలంలోని చల్మెడ గ్రామంలోని గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు ఊరేగింపులో పాల్గొన్నారు. పాడి పంటలతో గ్రామం చల్లగా ఉండాలని కోరుకున్నారు. ముత్యంరెడ్డి, నర్సింహారెడ్డి, తుమ్మల రమేశ్‌, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



గురువులతో లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధులు

నర్సాపూర్‌: యోగాతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని హైదరాబాద్‌కు చెందిన యోగా గురువు భైరయ్య చెప్పారు. ఆదివారం గురు పౌర్ణమిను పురస్కరించుకుని స్థానిక లయన్స్‌క్లబ్‌ ఆఫ్‌ నర్సాపూర్‌ స్నేహబంధు, స్థానిక నిత్య జీవన యోగా సాధన సమితి ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భైరయ్య మాట్లాడుతూ యోగాతోనే ఆరోగ్యంగా ఉండడం సాధ్యమని, ప్రతి ఒక్కరు రోజులో కొంత సమయాన్ని కేటాయించి ఆసనాలు వేయాలని పిలుపునిచ్చారు. స్థానిక యోగా గురువులు చంద్రశేఖర్‌, సురేందర్‌గౌడ్‌, భిక్షపతిరెడ్డిని కూడా నిర్వాహకులు సన్మానించారు. లయన్స్‌క్లబ్‌ అధ్యక్షుడు జైపాల్‌, కార్యదర్శి శ్రీకాంత్‌, కోశాధికారి మాణిక్యంగౌడ్‌, నర్సింహారెడ్డి, రాజు యాదవ్‌, బుచ్చేశ్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న గౌతమ్‌

చేగుంట(తూప్రాన్‌): మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు సదరం క్యాంపునకు వెళ్లడానికి త్వరగా అవకాశం కల్పించేలా చూడాలని దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్‌ కోరారు. మండలంలోని కిష్టాపూర్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కురుమ ఎల్లయ్య, కుమ్మరి స్వామి సదరం క్యాంపునకు హాజరయ్యేందుకు మీసేవలో దరఖాస్తు చేసుకుని 50రోజులు గడిచినా అవకాశం రాలేదని వాపోయారు. జిల్లాలో సదరం క్యాంపులో దివ్యాంగుల సర్టిఫికెట్‌ పొందడానికి బాధితులు నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సదరం క్యాంపునకు వెళ్లడానికి త్వరగా అవకాశం వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. గృహలక్ష్మి, బ్యాక్‌లాగ్‌ పోస్టులు, అంత్యోదయ కార్డుల్లో ప్రాధాన్యం అలాగే ఉచిత బస్సు ప్రయాణానికి అవకాశం కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బగలాముఖీ శక్తిపీఠంలో పూజలు



శివ్వంపేట(నర్సాపూర్‌): ధ్యాన మందిరంలో భక్తుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో నిర్వహించిన ఉత్సవాల్లో పూజారి సంతోష్‌శర్మ, ఆలయ స్థలదాత పబ్బ స్వరూప రమేశ్‌గుప్తా దంపతులు, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్‌, మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్‌, సూర్యంగౌడ్‌, కొండల్‌, పోచగౌడ్‌, యాదగిరి, వెంకటేశ్‌ తదితరులు ఉన్నారు.